క్లుప్తంగా

గుంత పూడ్చివేత



తాండూరు రూరల్: మండల పరిధిలోని మల్కాపూర్ ప్రాథమిక పాఠశాల ఎదుట చిన్న గుంత ఏర్పడింది. వర్షం పడితే గుంతలో వర్షం నీరు చేరి పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఉపాధ్యాయులు గ్రామ మాజీ సర్పంచు విజయలక్ష్మి పండరి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె శనివారం ట్రాక్టర్లతో నాపరాతి ముక్కలను గుంతలో వేసి జేసీబీ సహాయంతో చదును చేయించారు.

24న లక్ష తులసి అర్చన



స్వామివారి మూలమూర్తి

కొడంగల్ : పేదల తిరుపతిగా పేరుగాంచిన పద్మావతి సమేత శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 24న మూడో శనివారం లక్ష తులసి దళాలతో స్వామివారికి అర్చన చేయనున్నారు. పూలు, తులసి దళాలతో అమ్మవారు, స్వామివారి మూలమూర్తులకు అలంకరించి, బ్రాహ్మణులు విష్ణు సహస్ర నామావళి పఠిస్తూ పూజలు చేయనున్నారు. శ్రావణమాసం మూడో శనివారం కావడంతో శ్రీవారి మూలమూర్తికి అభిషేకం, తోమాల సేవ, అలంకరణ చేస్తారు. తెలంగాణ, కర్నాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుంటారు.

అందరి సహకారంతో ఆలయ నిర్మాణం



గర్భగుడికి గడపపూజ చేస్తున్న గ్రామస్తులు

తాండూరు రూరల్: అందరి సహకారంతో ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణం చేపడుతున్నామని గ్రామపెద్దలు అన్నారు. తాండూరు మండలం శనివారం అంతారం గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా గర్భగుడికి గడపపూజ నిర్వహించారు. వేదపడింతులు వెంకటచార్ శుక్రవార్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. దాతల సహకారంతో ఆలయ నిర్మాణం కొనసాగుతుందని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

వెలగని వీధి దీపాలు



కొడంగల్ : మున్సిపల్ పరిధిలో జాతీయ రహదారిపై బల్బులు వెగడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అంధకారంగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు వాపోయారు. అధికారులు స్పందించి బల్బులు ఏర్పాటు చేయాలని కోరారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి రావులపల్లి వెళ్లే దారిలో పలు చోట్ల జాతీయ రహదారిపై బల్బులు వెలగడం లేదని చెప్పారు.

సేవలే గుర్తుండిపోతాయి..



జంగయ్యను సన్మానిస్తున్న నాయకులు

పూడూరు: ఉద్యోగులకు పదవి విరమణ తప్పదని, విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తుండిపోతాయని పీఏసీఎస్ చైర్మన్ పటోళ్ల సతీష్‌రెడ్డి అన్నారు. శనివారం పూడూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి కేంద్రం సీఈఓ జంగయ్య పదవి విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవికి మాత్రమే విరమణ అని సేవలకు కాదన్నారు. అనంతరం నాయకులు, సొసైటీ డైరెక్టర్లు, కుటుంబ సభ్యులు సీఈఓ జంగయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్తయ్య, అష్టావధాని మలుగ అంజయ్య, సీఈఓ ఖలీల్, సొసైటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంతో చెలగాటం

మాంస విక్రయ కేంద్రాలు ప్రజల ప్రాణాలతో వ్యాపారం చేస్తున్నాయి. ఒక పక్క కలుషిత ఆహారం, మరో పక్క నిల్వ ఉంచిన మాంసం విక్రయాలతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. దానికి తోడు అధికారుల పర్యవేక్షణ లోపం వ్యాపారాలకు మరింత ఊతం ఇస్తోంది.

- చనిపోయిన జీవాలు, కోళ్ల మాంసం విక్రయాలు
- రోగాల బారిన పడుతున్న జనం
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



మాంసం విక్రయ దుకాణాలు



ఫ్రిజ్‌లో దాచి ఉంచిన మాంసం (ఫైల్)

పరిగి: మాంసం విక్రయదారులు కనీస నిబంధనలు పాటించడం లేదు. అధికారుల అలసత్వంతో వారి మోసాలకు అడ్డూ అదుపు లేకుండా పోతుంది. ఇష్టానుసారంగా విక్రయాలు సాగిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఇటీవల ఓ దుకాణదారుడి వద్ద కుళ్లిన మాంసం లభించడంతో విక్రయదారులపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపాలిటీలో మాంసం దుకాణాలు ఉన్నప్పటికీ ట్రేడ్ లైసెన్సులు మాత్రం లేవు. ప్రధాన రోడ్లు, గల్లీల్లో చికెన్, మటన్ విక్రయదుకాణాలు అనేకం ఉన్నా.. కేవలం కొన్ని షాపులకు మాత్రమే ట్రేడ్ లైసెన్స్‌లు ఉన్నట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా చనిపోయిన జీవాలు, గాయాలతో ఉన్న కోళ్లు, మిగిలిన మాంసాన్ని, వెనిగర్‌లో ముంచి ఫ్రీజ్‌లో దాచి మరుసటి రోజు అమ్ముతుండటంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

జోరుగా విక్రయాలు..

మాంసాహార ప్రియుల బలహీనతను మటన్, చికెన్ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఆదివారం వచ్చిందంటే చికెన్, మటన్ అమ్మకాలు ఎక్కువగా జరుగుతాయి. నియోజకవర్గ కేంద్రం కావడంతో ఏది కొనాలన్నా పట్టణ కేంద్రానికి ప్రజలు వస్తుంటారు. ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని కొందరు మాంసం వ్యాపారులు ఇష్టారాజ్యంగా తినడానికి వీల్లేని మాంసాన్ని విక్రయిస్తున్నట్లు సమాచారం. పశువైద్యులు పరీక్షించిన గొర్రెలు, పొట్టేళ్ల, మేకల మాంసాన్ని మాత్రమే విక్రయించాలని నిబంధనలు ఉన్నప్పటికీ ఎక్కడ అమలు కావడం లేదు.

మోసం ఇలా..

ముసురు వర్షాలకు మేకలు, గొర్రెలకు అంటు వ్యాధులు ఎక్కువగా సోకుతుంటాయి. ఆంత్రాక్స్, గాలి కుంటువ్యాధి సోకి వందలకు పైగా గొర్రెలు మృత్యువాత పడుతుంటాయి. ఇదే సమయంలో కొంత మంది వ్యాపారస్తులు గొర్రెల పెంపకదారుల వద్ద తక్కువ ధరకు వాటిని కొనుగోలు చేసి మాంసాన్ని అమ్ముతున్నారు. ఆంత్రాక్స్ బ్యాక్టీరియా, ఇతర వ్యాధులు సోకిన గొర్రె మాంసాన్ని తింటే అవే వ్యాధులు మనుషులకు వ్యాపించే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఒక్కో జీవాన్ని వెయ్యి, పదిహేను వందలకు కొనుగోలు చేసి కిలో మాంసం రూ.800 వరకు విక్రయిస్తున్నారు.

నిబంధనలు..

- ▲ మాంసానికి కోసే జీవాలు ఆరోగ్యంగా ఉండాలి
- ▲ జీవాలు కనీసం 8కిలోలకు పైగా ఉండాలి
- ▲ దెబ్బలు తగిలిన, రోగం వచ్చిన వాటిని వధకు తీసుకురావద్దు
- ▲ జీవాలు ఆరోగ్యంగా ఉన్నాయని పశు వైద్యాధికారి ధృవీకరించాలి

అధికారులు తనిఖీ చేయాలి



పట్టణ కేంద్రంలో మాంసం విక్రయించే దుకాణాలు చాలా ఉన్నాయి. ఏ దుకాణంలో ఎలాంటి మాంసం విక్రయిస్తారో తెలియని పరిస్థితి ఉంది. చనిపోయిన కోళ్లు, మేకలను కోసి విక్రయిస్తున్నారు. దీంతో ప్రజలు రోగాల బారినపడే ప్రమాదం ఉంది. కావునా అధికారులు మాంసం దుకాణాలను తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలి.

– వెంకటయ్య, వినియోగదారుడు, పరిగి

కొత్త భవనానికి గ్రహణం వీడేనా?

పూర్తయినా ప్రారంభానికి నోచుకోని అంగన్‌వాడీ కేంద్రం



అంగన్‌వాడీ భవనం

ధారూరు: మండలం పరిధిలోని అవుసుపల్లిలో చిన్నారుల కోసం నిర్మించిన అంగన్‌వాడీ భవనం పూర్తయిన ప్రారంభానికి నోచుకోవడం లేదు. చిన్నారులు పాఠశాల వరండాలో కూర్చుని వెళ్లడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాత అంగన్‌వాడీ పైకప్పు పెచ్చులూడుతున్నా పట్టించుకోవడం లేదని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత నెల 26న జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఇన్‌చార్జి పీడీ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన కాంట్రాక్టర్ కొత్త భవనం అప్పగించడం లేదని విచారం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణం పూర్తయి 19 నెలలు గడుస్తున్నా భవనాన్ని తమకు అప్పగించడం లేదని ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ శాంతాబాయి ఆరోపించారు. ఎంపీడీఓ త్వరలో భవనాన్ని ఇప్పిస్తామని చెప్పారని ఆమె అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాల వరండాలో పిల్లల్ని కూర్చొబెడుతున్నామన్నారు. భవన నిర్మాణ బిల్లులు ఇంకా రావాల్సి ఉందని, డబ్బులు వచ్చే వరకు భవనం ఇచ్చే ప్రసక్తి లేదని కాంట్రాక్టర్ అంటున్నారని పేర్కొన్నారు. ప్రస్తుత వానాకాలంలో చిన్న పిల్లలు అవస్థలు పడుతున్నారని, పూర్తయిన భవనాన్ని వెంటనే తమకు అప్పగిస్తే బాగుంటుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి, సమస్యను పరిష్కరించాలని గ్రామంలోని చిన్నారులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

నరేందర్‌రెడ్డికి సినారె సాహిత్య పురస్కారం



పురస్కారం అందుకుంటున్న నరేందర్‌రెడ్డి

పెద్దేముల్: ప్రభుత్వ ఉపాధ్యాయులు ద్యావరి నరేందర్‌రెడ్డి శనివారం సినారె సాహిత్య పురస్కారం అందుకున్నారు. సినారే కళాపీఠం ఆధ్వర్యంలో సాహిత్య పురస్కారం అందించారు. మండల కేంద్రానికి చెందిన ద్యావరి నరేందర్‌రెడ్డి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. గజల్ ప్రక్రియలో రెండు దశాబ్దాల నుంచి విశేష కృషి చేస్తున్నారు. మరోవైపు పలు సినిమాలకు మాటల రచయితగా పని చేశారు. మహాకవి సి.నారాయణరెడ్డి జయంతిని పురస్కరించుకొని తుర్కయాంజాల్ సాహిత్య పురస్కారాలను తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, సాహితీవేత్త డాక్టర్. నందిని సిద్ధారెడ్డి ప్రముఖ కవులకు సినారే సాహిత్య పురస్కారాలను అందజేశారు. వికారాబాద్ జిల్లా నుంచి కవి ద్యావరి నరేందర్‌రెడ్డి పురస్కారం అందుకున్నారు. కార్యక్రమంలో కళాపీఠం అధ్యక్షుడు మల్లెకొడిరాములు, తేజ, తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి అధ్యక్షుడు జలంధర్‌రెడ్డి, సాహిత్య సేవా సంస్థ అధ్యక్షుడు పోరెడ్డి రంగయ్య తదితరులున్నారు.

జోరుగా ఆలయ నిర్మాణ పనులు



మాట్లాడుతున్న ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు

కొడంగల్ : పట్టణ శివారులో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. విరాళాలు ప్రకటించిన దాతలు సహకరించి నిర్మాణంలో భాగస్వాములు కావాలని కమిటీ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. ఏప్రిల్ మాసంలో జరిగే విషుపూజ వరకు ఆలయాన్ని భక్తులకు అందుబాటులో తేవడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆలయ నిర్మాణంలో భాగంగా విరాళాలు ఇస్తామని చెప్పిన భక్తులు తొందరగా ఇచ్చి సహకరించాలని కోరారు. ప్రస్తుతం గర్భగుడి నిర్మాణ పనులు జరుగుతున్నట్లు చెప్పారు. పెద్దమొత్తంలో డబ్బులు అవసరం ఉందన్నారు. యాదాద్రి ఆలయం మాదిరిగా కొడంగల్‌లో అయ్యప్పస్వామి ఆలయాన్ని కృష్ణ శిలతో నిర్మిస్తున్నట్లు చెప్పారు.

భూములు లాక్కోవడం ఆపండి

వ్యవసాయ కార్మిక సంఘం హెచ్చరిక



కరపత్రం ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

దుద్యాల్ : అభివృద్ధిని బూచిగా చూపి పేదల భూములు లాక్కోవడం ఆపాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని హకీంపేట్ గ్రామంలో ఫార్మా కంపెనీ భూ బాధితుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలాన్ని అభివృద్ధి చేయాలంటే ఒక్క ఫార్మా కంపెనీతో మాత్రమే సాధ్యం కాదన్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు ఉన్న ఫార్మా కంపెనీ ఏర్పాటును ఉపసంహరించుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కంపెనీ పేరుతో హకీంపేట్ గ్రామానికి చెందిన పరువురు రైతుల నుంచి 505 ఎకరాలు, పోలేపల్లి గ్రామానికి చెందిన రైతుల నుంచి 130 ఎకరాలు, లగచెర్ల, రోటి బండా తండా, పులిచెర్ల తండాల రైతుల నుంచి 643 ఎకరాలు.. మొత్తంగా 1274 ఎకరాలను సేకరించాడానికి ఇటీవల ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో ఆయా గ్రామాల రైతుల్లో మరింత ఆందోళన మొదలైంది. వ్యవసాయం చేసుకుని జీవనం సాగించే రైతుల నుంచి వారి అనుమతులు లేకుండా భూసేకరణ చేస్తే సహించామన్నారు. గత ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించడంతోనే ప్రజలు పాతాళానికి తొక్కారని విమర్శించారు. పేదల భూముల జోలికి వస్తే పోరాటాలకు సిద్ధమవుతున్నామన్నారు. అనంతరం ఈ నెల 13న కొడంగల్ పట్టణంలోని రెడ్డి బసిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జిల్లా భూ సదస్సు కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, తెలంగాణ ఉద్యమకారుల జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, రైతులు నాయకులు మల్లేశ్, నర్సింలు, బసప్ప, మణికంఠ గడ్, నారాయణ, వెంకటయ్య, శివకుమార్, గోపాల్‌నాయక్, భూ బాధితులు పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిలర్‌పై కేసు



నరేందర్ స్థలంలో ధ్వంసం చేసిన హద్దురాళ్లు

తాండూరు: మున్సిపల్ పరిధిలోని 28వ వార్డు కౌన్సిలర్ విజయాదేవిపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. తాండూరు పట్టణంలోని పాతకుంట ప్రాంతంలోని సర్వే నంబర్ 142, మంకల్ నరేందర్, కుటుంబ సభ్యులకు చెందిన ఎకరాస్థలాన్ని ఇటీవల డివిజన్ సర్వేయర్‌తో సర్వే చేయించి హద్దురాళ్లు వేసుకొని, చుట్టూ కంచె నిర్మించుకున్నారు. అయితే, పాతకుంట ప్రాంతంలో సింధు డిగ్రీకళాశాల కొనసాగుతోంది. కళాశాల యజమాని రంగారావు, మున్సిపల్ కౌన్సిలర్ విజయాదేవి దంపతులతో పాటు కూతురు సింధులు అక్రమంగా నరేందర్ స్థలంలోకి చొరబడి ఈ నెల 1న హద్దు రాళ్లను ధ్వంసం చేశారు. ఈ విషయమై నరేందర్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో రంగారావు, మున్సిపల్ కౌన్సిలర్ విజయాదేవి, కూతురు సింధుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి



చెక్కు అందజేస్తున్న దాతలు

చేవెళ్ల: ప్రతిఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శనివారం వెంకట్‌రెడ్డి జన్మదినం సందర్భంగా చేవెళ్లకు చెందిన దాతలు గుత్తి మల్లేశ్ బ్రదర్స్ బీసీవసతి గృహం విద్యార్థుల మధ్య జన్మదిన వేడుకలు నిర్వహించి విద్యార్థులకు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేయించారు. అనంతరం పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అలాగే, చేవెళ్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సీసీకెమెరాల ఏర్పాటుకు చేవెళ్లకు చెందిన శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ టేకుపల్లి శ్రీనివాస్‌లు రూ. 45వేల విరాళం ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండారి శైలజ, మండల నాయకులు దేవర సమత, బండారు ఆగిరెడ్డి, గుడిపల్లి వెంకట్ రెడ్డి, మద్దెల శ్రీనివాస్, యువకులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరిగి: నేడు(ఆదివారం) పట్టణ కేంద్రంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ ఏఈ ఖాజా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లైన్ పనులు, మరమ్మతుల కారణంగా పట్టణ కేంద్రంలోని బాహర్‌పేట్, హనుమాన్ టెంపుల్, వాగ్దేవి హాస్పిటల్, వల్లబానగర్, ఎన్‌టీఆర్ నగర్, శ్రీనివాస కాలనీ, తుంకల్‌గడ్డ, మార్కెట్‌యార్డ్, నస్కల్ రోడ్డు నాయ్‌కోట్‌వాడలో ఉ.11 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎల్‌ఓసీల అందజేత



పరిగి: సీఎం సహాయనిధి నుంచి మంజూరైన ఎల్‌ఓసీ చెక్కులను ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు బాధితులకు శనివారం అందజేశారు. సుల్తాన్‌పూర్‌కు చెందిన ధనలక్ష్మి అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందుతుండటంతో రూ.2లక్షలు, పట్టణ కేంద్రానికి హబీబ్‌బైగ్‌కు రూ. 2.5లక్షలు చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అమెరికా పర్యటనలో ఉన్న ప్రజా సేవ నిలిపోలేదని అనారోగ్యంతో ఉన్న వారికి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో నవాజ్, రవికాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత యోగా తరగతులు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఈశ్వర్ కాలనీలో ఉన్న అభ్యాస్ పాఠశాలలో పతాంజలీ యోగా సమితి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత యోగా శిక్షణా తరగతులు ఆదివారం నుంచి ప్రారంభిస్తున్నట్లు సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పానుగంటి శశిధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత శిక్షణను యోగా గురువు లావణ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 5.30 నుంచి సాయంత్రం 7గంటల వరకు శిక్షణ ఉంటుందని, ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వివాహానికి చేయూత

షాబాద్: మండల పరిధిలోని హైతాబాద్ గ్రామానికి చెందిన పేదింటి మహిళ అంజమ్మ కూతురు వివాహానికి మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ చాంద్‌పాషా తనవంతు సహాయంగా రూ.11వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు గ్రామంలో మొత్తం 41 మంది ఆడబిడ్డల పెళ్లిళ్లు చేయగా వారందరికీ రూ.11వేల చొప్పున ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు. నిరుపేదలకు తనవంతు సహాయం చేసేందుకు కృషి చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సూద యాదయ్య, గ్రామ మాజీ సర్పంచ్‌లు పెద్దజంగని దర్శన్, ర్యాకల శేఖర్, గ్రామస్తులు రాజుగౌడ్, గోపాల్, ఆచారి, రాంచంద్రయ్య, జంగయ్య, ఆంజనేయులు, ఇస్తారయ్య తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఐసీఈయూ నూతన కార్యవర్గం

అనంతగిరి: వికారాబాద్‌లోని ఎల్ఐసీ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం వికారాబాద్‌లో జరిగిన ఐసీఈయూ వికారాబాద్ బ్రాంచ్ యూనిట్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో వికారాబాద్ బ్రాంచ్ యూనిట్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జంగయ్య, ఉపాధ్యక్షుడిగా గోపికృష్ణ, కార్యదర్శిగా సత్యనారాయణ, సహ కార్యదర్శులుగా పార్వతప్ప, పూర్ణానందసాయి, కోశాధికారిగా వినోద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ డివిజన్ నాయకులు మద్దిలేటి, రాజేశ్వర్, గిరిధర్, గణేష్, వెంకటరమణ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం



యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవంలో సంఘం సభ్యులు

పరిగి: విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ నిరంతరం పోరాటం చేస్తోందని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు దశరథ్ అన్నారు. శనివారం యూటీఎఫ్ 51వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణ కేంద్రంలో యూటీఎఫ్ జెండా ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 50 సంవత్సరాలుగా యూటీఎఫ్ ఎన్నో పోరాటాలు చేసి, ఎంతో సాధించిందన్నారు. విద్యారంగ అభివృద్ధిలో ప్రభుత్వానికి సలహాలు, సూచనలు చేస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. అలాగే, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు జమున, సభ్యులు వెంకటయ్య, గంగాధర్, రమేష్, బుచ్చయ్య, మేఘ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యను కాపాడటమే లక్ష్యం



యూనియన్ జెండాను ఆవిష్కరిస్తున్న వెంకటరత్నం తదితరులు

అనంతగిరి: ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడటమే యూటీఎఫ్ ధ్యేయమని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం అన్నారు. యూటీఎఫ్ 51వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వికారాబాద్‌లోని యూటీఎఫ్ కార్యాలయం ఎదుట యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా సంస్థలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావాలన్నారు. ఎన్నో ఉద్యమాలు చేపట్టి అనేక విజయాలు సాధించి నేడు 51 సంవత్సరంలో అడుగుపెడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నీలమ్మ, వినోద్‌కుబార్, రాములు, ప్రభాకర్, పరమేశ్వర్, లక్ష్మయ్య, యాదయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

మర్పల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001-2002 సంవత్సరంలో పదొవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శనివారం కలుసుకొని ఘనంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. రెండు దశాబ్దాల అనంతరం అందరు ఏకమై సందడి చేశారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆటపాటలతో కేరింతలు కొట్టారు. అనంతరం ఒక్కరికొక్కరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులకు సన్మానం చేసి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లయ్య, కృష్ణారెడ్డి, ఆనందం, భాస్కర్, రాజు, ప్రసన్న, సుజాత, భవానీలతో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.